క్లుప్తంగా

8 నుంచి వ్యాపార నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ

సబ్బవరం: వ్యాపార వ్యవస్థాపకత, నైపుణ్యాల అభివృద్ధి కోసం ప్రభుత్వ సహకారం, ప్రపంచ బ్యాంకు సౌజన్యంతో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.విజయకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అసకపల్లి సామాజిక భవనంలో ట్రైడ్జ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రై.లి. ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమం రెండవ బ్యాచ్ ఈ నెల 8 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి కలిగి, 18 నుంచి 40 ఏళ్ల వయసు స్త్రీ, పురుషులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ సెంటర్‌లో 2 కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్, క్యాస్ట్ సర్టిఫికెట్ జిరాక్స్‌లతో ఈ నెల 7లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9963174608, 9573960852 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



శంకుస్థాపనలో ఎమ్మెల్యే పంచకర్ల, మేయర్ పీలా, కార్పొరేటర్ వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు చేతుల మీదుగా బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. రూ.8.35 కోట్ల నిధులతో వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు తెలిపారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అగనంపూడి జోన్ ఏర్పాటు చేయాలని వినతి

అగనంపూడి: గాజువాక జోన్‌లోని 77, 78, 79, 85, 88 వార్డులతో కలిపి అగనంపూడి జోన్ ప్రకటించేలా జీవీఎంసీలో ఒత్తిడి తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలనాయుడును అగనంపూడి నాయకులు కోరారు. వెదుళ్లనరవలో బుధవారం సమావేశమైన నాయకులు ముత్యాలనాయుడును కలిసి వినతిపత్రం అందేశారు. పెందుర్తి-2 జోన్‌గా కాకుండా అగనంపూడి లేదా గాజువాక జోన్-2గా ప్రకటించేలా పాలకవర్గంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. నాయకులు బి.సత్యనారాయణ, టి.వెంకటరమణ, బి.చందు, వి.శ్రీనివాసరావు, పి.అచ్యుత్, వి.నాగేంద్ర పాల్గొన్నారు.

పారాయణ సమితి బృందానికి సత్కారం



బొర్రమాంబ పారాయణ సేవా సమితి బృందాన్ని సత్కరిస్తున్న తాతారావు, తదితరులు

అగనంపూడి: మహాత్మాగాంధీ సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు భారతీయ ప్రాచీన సాంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేలా బొర్రమాంబ పారాయణ సేవా సమితి కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు అన్నారు. అగనంపూడిలో మేడిశెట్టి విజయ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావుతోపాటు పారాయణ సేవా సమితి ప్రతినిధులను సత్కరించారు. ఓపక్క సేవా కార్యక్రమాలు, మరో పక్క దైవ చింతనలో ఉండడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జననీ సేవా సంస్థ చైర్మన్ విందుల వెంకటరమణ, కరణం సత్యారావు పాల్గొన్నారు.

గాయకుడు రామకృష్ణకు స్వర నీరాజనం

సీతంపేట: సినీ నేపథ్య గాయకుడు వి.రామకృష్ణ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం స్వరాలయ స్టూడియోలో రామకృష్ణకు స్వర నీరాజనం అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరిలో రామకృష్ణ పాడిన పాటలను గాయనీ గాయకులు ఆలపించి అలరించారు. ముందుగా ముఖ్య అతిథి న్యాయవాది ఉప్పలపాటి జానకి రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు.



చిన్నయ్యపాలెం సమీపంలో ముంపునకు గురైన వరి క్షేత్రాలు



వంగలి సమీపంలో నీట మునిగిన వరి క్షేత్రాలు



విందుకుండల్లా సాగునీటి చెరువులు



ముంపులో పొలాలు
అన్నదాతల కన్నీళ్లు

- అయితే అతివృష్టి లేకుంటే.. అనావృష్టితో రైతుల అగచాట్లు
- ఖరీఫ్ ప్రారంభంలో వర్షాభావంతో వరినాట్లకు ఆటంకం
- ప్రస్తుతం ఎడతెరిపిలేని వర్షాలతో పొంగి ప్రవహిస్తున్న చెరువులు
- పలు చోట్ల నీట మునిగిన వరి క్షేత్రాలు.. ఆందోళనలో రైతులు

మండలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం **3,395** ఎకరాలు

వరి నాట్లు వేసిన విస్తీర్ణం **3,050** ఎకరాలు

సబ్బవరం మండలంలో వరి సాగు చేస్తున్న రైతుల బతుకులు బితుకుబితుకుమంటున్నాయి. వర్షాధార ప్రాంతం కావడంతో వరుణుడిపై భారం వేసి సాగుకు సిద్ధమైన రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. అనావృష్టి సమయంలో కొంతలో కొంత పెట్టుబడి వ్యయం తగ్గుతున్నా.. అతివృష్టితో సర్వం కోల్పోతున్నారు. అధిక పెట్టుబడులు పెట్టి వరినాట్లు వేసిన రైతులు ఇటీవలి వర్షాలకు పొలాలు నీట మునగడంతో ఆందోళన చెందుతున్నారు.

సబ్బవరం: మండలంలో వరిసాగు పూర్తిగా వర్షాధారం. ఖరీఫ్ ప్రారంభంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు వరి నాట్లు వేసుకునే పరిస్థితి లేదనుకున్నారు. వరి నారును కాపాడుకునేందుకు బయటి నుంచి నీటిని తెచ్చి తడులు పెట్టేవారు. ఇటీవలి వర్షాలకు రైతులు దమ్ములు పట్టి, నాట్లు వేసుకున్నారు. అయితే ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తూనే ఉండటంతో పలు చోట్ల వరి క్షేత్రాలు నీటి ముంపునకు గురయ్యాయి. ఒక్కో ఎకరానికి రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టిన రైతులు పొలాల దుస్థితిని చూసి తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అంచనాలకు మించి ముంపు!

మండలంలో ప్రస్తుతం ముంపునకు గురైన వరి విస్తీర్ణం 40 ఎకరాల వరకూ ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. వాస్తవంగా నీటి మునిగిన వరి నాట్ల విస్తీర్ణం రెండింతలు ఉంటుందని రైతులు చెబుతున్నారు. వరి సాగులో అయితే అతివృష్టి లేకపోతే అనావృష్టితో తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. మండలంలో రైతులకు చిన్న కమతాలు ఉండటం, వర్షాధార సాగుతో పంట చేతికొస్తుందన్న నమ్మకం లేకుండా పోతోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు మళ్లుతున్నారు. ఈ ఏడాది దాదాపు 300-400 ఎకరాల్లో వరి స్థానంలో దీర్ఘకాలిక అటవీ పంటలైన సరుగుడు, యూకలిప్టస్ వేసుకున్నారంటే.. రైతుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సస్య రక్షణ చర్యలు తప్పనిసరి

- నీట మునిగిన వరి క్షేత్రాల్లో వీలైనంత వేగంగా నీటిని తొలగించాలి.
- నీరు తగ్గాక ఎకరాకు 5 నుంచి 6 కిలోల యూరియాను వేసుకోవాలి
- వీలైనంత వరకూ నానో యూరియాను వరి పైరుపై పిచికారీ చేస్తే మేలు.
- అగ్గి తెగులు, పాడ తెగులు గట్లు నుండి వ్యాపించే అవకాశం అధికంగా ఉంది. అందువల్ల గట్లపై గడ్డి ఎక్కువగా పెరగకుండా చూసుకోవాలి.
- ఎరువుల్ని విచక్షణా రహితంగా వినియోస్తే తెగుళ్ల ఉధృతి పెరుగుతుంది. తగు మోతాదులోనే ఎరువల్ని వాడాలి.
- ముందుగా నాట్లు వేసిన చోట చిరుపొట్ట దశకు చేను వస్తే ఎకరానికి 20 కిలోల వరకూ పొటాష్ వేసుకోవాలి.

పది రోజులుగా ముంపులోనే..



సుమారు 1.10 ఎకరాల్లో వరి నాట్లు వేశాం. ఊర చెరువును అనుకుని ఉన్న రెండు మడులు(సుమారు అరెకరం) నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు పూర్తిగా నిండి ప్రవహిస్తుండటంతో పొలంలో **నీరు తగ్గట్లేదు.** 10 రోజులకు పైనే నీటిలో **మునిగి ఉండటంతో** నాట్లు పనికొచ్చే పరిస్థితి **కనిపించట్లేదు.**

– **పిల్లల సింహాచలం**, రాయపుర అగ్రహారం

ప్రభుత్వమే ఆదుకోవాలి



సుమారు 80 సెంట్లలో వరి **నాట్లు వేశాం.** ఇటీవల **కురిసిన భారీ వర్షాల**కు 45 **సెంట్లు వరకూ నీట** మునిగింది. **చెరువును** అనుకుని **ఉండటంతో మాతో**పాటు చుట్టు పక్కల రైతులకు **చెందిన 10** నుంచి 12 ఎకరాల వరకూ **ముంపులోనే ఉంది.** సాగు పెట్టుబడులు అధికంగా ఉండటంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– రాజాన శ్రీనివాసరావు, రాయపుర అగ్రహారం

సిబ్బందితో కలిసి పరిశీలించాం



ఇటీవల కురిసిన వర్షాలకు పలు చోట్ల వరి క్షేత్రాలు నీటి ముంపునకు గురయ్యాయి. వాటిని క్షేత్ర స్థాయి సిబ్బందితో కలిసి పరిశీలించాం. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కొన్ని చోట్ల ముంపు నుంచి వరి క్షేత్రాలు బయటపడ్డాయి. ఇలాంటి చోట్ల చేనుకు తెగుళ్ల సోకకుండా చేపట్టాల్సిన నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి

వేతన బకాయిలపై 'ఉపాధి' కార్మికుల ఆందోళన



బొద్దపువానిపాలెంలో ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ కార్మికులు

పరవాడ: ఉపాధిహామీ పథకం కార్మికుల బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో బొద్దపువానిపాలెం పని ప్రదేశంలో ఉపాధి కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు గత 12 వారాలుగా వేతనాలు విడుదల చేయని కారణంగా కార్మికుల కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. కార్మికులకు బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను విరమించుకోవాలన్నారు. ఉపాధి కార్మికులకు ఏడాదికి 200 రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కొలతలతో పని లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారం రూ.309 వేతనం చెల్లించాలన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులకు పనులు కల్పించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం లైవ్ ఆడిట్ పేరుతో ఉపాధి కార్మికులను వేధింపులకు గురిచేసే విధానాన్ని మానుకోవాలన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు అదీప్‌రాజ్ పరామర్శ



చిప్పల చందును పరామర్శిస్తున్న అదీప్‌రాజ్

పెందుర్తి: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జీవీఎంసీ 95వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిప్పల చందును పార్టీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు, సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. సుజాతనగర్‌లోని ఓ అస్పత్రిలో చికిత్స పొందుతున్న చందును బుధవారం కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు రాపర్తి మాధవరావు, తామర్ల నర్సింగరావు, మెంటి మహేష్, చందుయాదవ్, మల్లువలస సన్ని, రాంబాబు, అల్లు ఈశ్వరరావు, జతిన్ తదితరులు ఉన్నారు.

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భీశెట్టి వెంకటరావు తల్లి భీశెట్టి రాములమ్మ మృతి చెందారు. గ్రామంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆమె భౌతిక కాయానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయనతో పాటు పరామర్శించినవారిలో పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొటాన రాము, సబ్బవరం మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాస్, దుర్గాప్రసాద్, గ్రామానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.



రాములమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

బాబోయ్ మురుగు

- రోడ్డుపైకి పోటెత్తుతున్న వాడుక నీరు
- ఆరు మాసాల నుంచి ఇదే దుస్థితి
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



చెత్తాచెదారంతో నిండిన మురుగుకాలువ



రోడ్డుపై నుంచి పారుతున్న మురుగునీరు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు గళ్లవానిపాలెం షిర్డీసాయినగర్‌లోని ప్రధాన రహదారిపైకి మురుగు ప్రవహిస్తుంది. ఆర్నెల్ల నుంచి ఇదే దుస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమలు, పందులతో సహవాసం చేస్తున్నామని వాపోతున్నారు. ఇళ్లలో మురుగునీరు రోడ్డుమీదుగా ప్రవహిస్తున్న విషయం జీవీఎంసీ డీఈ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ విశాఖ, స్వచ్ఛ సర్వేక్షణ్ అని ఊదరగొట్టే అధికారులకు మా ఇబ్బందులు పట్టకపోవడం దారుణమని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. జీవీఎంసీ కమిషనర్ స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మరణిస్తూ.. మరొకరికి చూపునిచ్చి...



నారాయణమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ గుదే సుశీలా గజేంద్రరావు మాతృమూర్తి నారాయణమ్మ మరణిస్తూ మరొకరికి చూపునివ్వడం గర్వంగా ఉందని రాష్ట్ర చేనేత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పప్పు రాజారావు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మి రామునాయుడు అన్నారు. సుశీలా గజేంద్రరావు మాతృమూర్తి నారాయణమ్మ సంతాపసభ బుధవారం పెదమడకలోని గుదే నివాస్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి నేత్రాలు దానం చేసిన గజేంద్రరావును అభినందించారు. ఆయన చేస్తున్న కార్యక్రమాలకు ఆమె వెన్నంటి నడిపేవారన్నారు. కార్యక్రమంలో ఇల్లపు ప్రసాద్, పద్మశాలి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు, బొండా అప్పారావు మాస్టార్, బలిరెడ్డి సత్యనారాయణ, కర్రి దేవేంద్ర, గవర సోమశేఖర్, కిడిమి హనుమంతురావు, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అదుపు తప్పితే....



అధిక లోడ్‌తో ప్రమాదకరంగా వెళ్తున్న వాహనం

పెదగంట్యాడ: మండలంలోని కొంత మంది వాహనదారులు పరిమితికి మించిన లోడ్‌తో ప్రమాదకరంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. మండలంలో ఫైర్ స్టేషన్ నుంచి యాతపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం వేలాది మంది ప్రయాణం చేస్తుంటారు. ఆ మార్గంలో అధిక లోడ్‌తో వాహనాలు వచ్చినప్పుడు ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోడ్ బండి ఏ మాత్రం అదుపు తప్పినా పెద్ద ప్రమాదమే సంభవిస్తుంది.

గుంతల రోడ్లతో ప్రయాణికుల అవస్థలు



భారీ గోతులతో దలాయిపాలెం రోడ్డు

పరవాడ: వాడచీపురుపల్లి–కలపాక రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రహదారిలో రాకపోకలు సాగిస్తున్న ఉప్పు లారీలు, వివిధ పరిశ్రమలకు చెందిన భారీ వాహనాలతో రోడ్డులో ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా రామచంద్రమ్మ ఆలయం, ఉప్పుగల్లీల వద్ద రోడ్డు గుంతలమయం కావడంతో ఎన్టీపీసీ, హిందూజా, ఉప్పుగల్లీల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. దారుణంగా ఉన్న రోడ్డులో స్కూల్ బస్సులు, ఆటోలు తరచూ మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు చేరలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్లపొదలతో బస్సులు, వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు తిప్పలు పడాల్సి వస్తోంది. రామచంద్రమ్మ ఆలయం వద్ద బోరు నుంచి మంచినీటిని నిత్యం ట్యాంకర్ల ద్వారా తరలించే క్రమంలో వృథా నీరంతా రోడ్డు మీద నిలిచి, రహదారి గుంతలమయంగా మారుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రామచంద్రమ్మ ఆలయం వద్ద ఏర్పడిన గుంతలు

అప్పన్న ఆలయంలో ప్రముఖులు



అప్పన్న ఆలయంలో అశోక్‌గజపతిరాజు దంపతులు



ఆలయంలో గీతాసింగ్, చిట్టిబాబు, సుధాకర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం సాయంత్రం గోవా గవర్నర్, సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు సతీసమేతంగా దర్శించుకున్నారు. గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన తొలిసారి ఇదే రావడం. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తర పూజ జరిపి, వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దేవస్థానం ఈవో త్రినాథరావు శేషవస్త్రం, ప్రసాదం, స్వామివారి జ్ఞాపిక అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుల్లితెర, సినీ హాస్య నటులు గీతాసింగ్, చిట్టిబాబు, సుధాకర్ దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో వారి పేరిట అర్చకులు పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందించారు.

గణపతి మండపాల్లో గరిక పూజలు



వేదపాఠశాలలో లక్ష్మీగణపతి హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో జరుగుతున్న వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామికి గరికపూజ ఘనంగా నిర్వహించారు. సహస్రనామాలు పఠిస్తూ స్వామికి అర్చకులు గరికపూజని జరిపారు. విశేష హారతులందించారు. కాలనీలోని మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజను తిలకించి, ఆశీస్సులు పొందారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, సింహపురి యూత్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా గణపతి హోమం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి చెందిన వేద పాఠశాలలో జరుగుతున్న చవితి ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. హోమగుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి జరిపారు. భక్తులకు, విద్యార్థులకు హోమ ప్రసాదాన్ని అందించారు. వేదపండితులు కాళ్లకూరి సుబ్రహ్మణ్యేశ్వరశర్మ పర్యవేక్షణలో హోమం జరిగింది. స్వామికి గరికపూజని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఏఈవో రమణమూర్తి, సూపరింటెండెంట్ మూర్తి పాల్గొన్నారు.



పోస్టాఫీసు వీధిలో సింహాద్రి యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో దీపారాధన



సింహపురికాలనీలో గణపతికి గరికపూజ నిర్వహిస్తున్న అర్చకులు

విశేషంగా దీపారాధన

అడవివరంలోని పోస్టాఫీసువీధిలో సింహాద్రి యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న చవితి ఉత్సవాల్లో పెద్ద ఎత్తున దీపారాధన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి సన్నిధిలో దీపాలు వెలిగించారు.